సెక్యూరిటీ అవసరం



మహిళా వైద్యులకు రాత్రి సమయాల్లో ప్రత్యేక సెక్యూరిటీ ఉండాలి. రోగులకు మెరుగైన వైద్యం కోసం వేరే ప్రాంతాలకు సిఫార్సు చేస్తేంటాం. ఈ నేపథ్యంలో రోగుల సహాయకులు, కుటుంబీకులు స్థానికంగానే చికిత్స చేయాలని ఒత్తిడి తీసుకొస్తుంటారు. గొడవ చేస్తుంటారు. మహిళా నర్సులు నచ్చజెప్పినా వినరు, తిరబడుతుంటారు. అటువంటి సమయంలో మేల్ సెక్యూరిటీ అవసరం ఎంతో ఉంటుంది. రాత్రిళ్ల ఆస్పత్రుల వద్ద పోలీసు పెట్రోలింగ్ ఉండేటట్టు చూడాలి.

– **డాక్టర్ శ్వేత**, గైనకాలజిస్ట్, సీహెచ్‌సీ, కోతులగుట్ట, కూనవరం

ప్రత్యేక చట్టాలు అమలుచేయాలి



మహిళ వైద్యులకు ఆస్పత్రుల్లో తప్పనిసరిగా మహిళా పోలీసు రక్షణ ఏర్పాటు చేయాలి. సరైన భద్రత, రక్షణ లేకపోవడంతోనే మహిళా వైద్యులు, ఉద్యోగులపై అత్యాచారాలు, హత్యలు తదితర సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు అమలు చేయాలి. ప్రత్యేకమైన నూతన చట్టాలు తీసుకురావాలి. ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలి.

– **డాక్టర్ మెర్సీ శరణ్య**, పాథాలజిస్ట్ సివిల్ సర్జన్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, అరకులోయ

క్లుప్తంగా

బియ్యం పంపిణీలో జాప్యం తగదు



ఎండీయూ ఆపరేటర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి: బియ్యం పంపిణీలో ఎలాంటి జాప్యం చేయవద్దని తహసీల్దార్ రామకృష్ణ ఆదేశించారు. ఆయన ఎండీయూ సభ్యులతో శనివారం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రతీ నెల ఒకటో తేదీన బియ్యం పంపిణీ చేయాలని సూచించారు. ప్రభుత్వం అందించే బియ్యం, గోధుమపిండి, పంచదార కూడా పంపిణీ చేయాలని చెప్పారు. అంత్యోదయ కార్డులు కలిగిన వారికి కిలో పంచదార ఇవ్వాలని సూచించారు.

అసంపూర్తి పనులతో అవస్థలు



రాజవొమ్మంగిలో రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో జరుగుతున్న ఎన్‌హెచ్516ఈ రోడ్ పనులు అసంపూర్తిగా వుండటంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. శనివారం కురిసిన వర్షానికి ఈ రహదారిపై కొండ వాగు ప్రవహిస్తున్న వరద నీటికి తోడు, మురుగు కాలువల నుంచి వచ్చిన మురుగు నీరు తోడు కావడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. మరోవైపు మురుగు వల్ల దుర్గంధం వెదజల్లడంతో స్థానికులు ముక్కు మూసుకోవాల్సి వచ్చింది. వాహనాల రాకపోకలకు సైతం ఆటకం కలిగింది. ఈ రహదారి పనులు ప్రణాళికాబద్ధంగా జరుగకపోవడం కారణంగా ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా నిత్యం రద్దీగా వుండే రాజవొమ్మంగి సెంటర్లో రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంభందిత అధికారులను కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు సొబగులు



అంగన్‌వాడీ కేంద్రం గోడపై అందమైన బొమ్మలు

దుంబ్రిగుడ: మండలంలోని ఓఎన్‌జీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని సీడీపీవో నీలిమా చెప్పారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను ఆకట్టుకునేలా గోడలపై వివిధ జంతువుల చిత్రాలతో అలంకరిస్తున్నట్టు చెప్పారు. ఈసందర్భంగా దుంబ్రిగుడలో ఏడు అంగన్‌వాడీ కేంద్రాలను వివిధ జంతువుల బొమ్మలతో తీర్చిదిద్దారు. కింజేరు, దుంబ్రిగుడ, గేదలబంద, లైగండ, అరకు, పరిడి, డొమంగి అంగన్‌వాడీ కేంద్రాల్లో అభివృద్ధి చేస్తు మిగత విడత కింద మరికొన్ని కేంద్రాలను గుర్తించి గోడలపై రంగులు వేస్తారని ఆమె చెప్పారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న మూడు అధ్యాపకుల పోస్టులను అతిథి అధ్యాపకులతో భర్తీ ప్రక్రియ చేడుతున్నామని స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ బి. రాధ తెలిపారు. జువాలజీ, ఒకేషనల్ కోర్సులలో కంప్యూటర్ సైన్స్, జీఎఫ్‌సీ పోస్టులను గెస్ట్ లెక్చరర్లతో భర్తీ చేస్తున్నామని, ఈ నెల 28న కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆమె కోరారు. జువాలజీ పోస్టుకు దరఖాస్తులు చేసే వారు ఎంఎస్‌సీ జువాలజీలో యాభై శాతం మార్కులతోను, కంప్యూటర్ సైన్స్‌కు పోస్టుకు బీటెక్ కంప్యూటర్స్‌లో యాభై శాతం మార్కులతోను, జీఎఫ్‌సీ పోస్టుకు ఎంఏ ఎకనామిక్స్(రూరల్ డెవలెప్‌మెంట్)లో యాభై మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఇంటర్వ్యూలో ఎంపికయ్యే అధ్యాపకులకు నెలకు రూ.10 వేలు చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తామని స్థానిక ప్రిన్సిపాల్ రాధ తెలిపారు.

గురుకులంలో మిగులు సీట్లకు దరఖాస్తులు

దేవరాపల్లి : తెనుగుపూడి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ సీట్లలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ప్రిన్సిపాల్ డి.జయప్రకాష్ తెలిపారు. 5వ తరగతిలో 10 సీట్లు, 8వ తరగతిలో 13 సీట్లు, 9వ తరగతిలో 5 సీట్లు, ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో 10 సీట్లు, ఫస్టియర్ బైపీసీలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. నెల 31లోగా విద్యాలయం పని చేసే వేళల్లో దరఖాస్తుతో పాటు విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్‌కార్డులతో నేరుగా కార్యాలయాన్ని సంప్రదించాలని ప్రిన్సిపాల్ జయప్రకాష్ కోరారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం



శిథిలావస్థకు చేరిన అరకులోయ డీఆర్ డిపో



బోసుబెడలోని డీఆర్ డిపో భవనం దుస్థితి

- శిథిలావస్థలో డీఆర్ డిపోలు
- వర్షం పడితే కారిపోతున్న భవనాలు
- పాడవుతున్న సరకులు
- ఆందోళనలో నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు

అరకులోయటౌన్: గిరిజనప్రాంత ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న నిత్యావసర సరకులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన గిరిజన సహకార సంస్థ డిఆర్ డిపోలు శిథిలవస్థకు చేరుకున్నాయి. దీంతో నిర్వాహకులు తీవ్ర నష్టపోతున్నారు. అంతేకాకుండా గిరిజనులకు అందించాల్సిన నిత్యవసర సరుకులు ముక్కిపోతున్నాయి. దీంతో డిపోల నిర్వాహకులు నష్టపోతున్నామని, గిరజనులు పాడైన సరకులు తీసుకువెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

లబ్ధిదారుల అవస్థలు

అరకులోయ జీసీసీ బ్రాంచ్ పరిధిలోని అరకులోయ, డుంబ్రిగుడ మండలాల పరిధిలో 26 డిఆర్‌డిపో భవనాలున్నాయి. వీటి పరిధిలో మొత్తం 74 మిని, మెయిన్ డిఆర్ డిపోలున్నాయి. గత కొన్ని దశాబ్దాల క్రితం నిర్మించిన 26 డిఆర్‌డిపో భవనాలు అన్ని శిథిలావస్థకు చేరాయి. దీంతో సుదూర ప్రాంత గిరిజనులు నిత్యావసర సరుకులు తీసుకునేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వీటిలో అరకులోయ, డుంబ్రిగుడ మండలాల పరిధిలోని 30, 836 కార్డుల లబ్ధిదారులతో పాటు అంగన్‌వాడీ సెంటర్లు, మిడ్డే మీల్స్, గిరిజన సంక్షేమ వసతి గృహాలకు మొత్తం 5956.21 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రతీ నెల సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని గత ప్రభుత్వ హయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహాన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఎండీయూ వాహానాల ద్వారా గ్రామాలకు చేరవేసి ఇంటింటికి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి డిఆర్ డిపోలు నూతనంగా నిర్మించాలని, మరమ్మత్తుకు గురైన వాటిని బాగు చేయాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

నూతన డిపో ఏర్పాటుచేయాలి



మా 8 గ్రామాల గిరిజనుల కోసం జయింతివలసలోని ప్రైవేట్ గృహంలో డిఆర్ డిపో ఏర్పాటు చేశారు. మా గ్రామాల గిరిజనులందరూ రైల్వే ట్రాక్ దాటి సరుకులు తెచ్చుకుంటున్నాం. చాలా ప్రమాదకర పరిస్థితిలో సరుకులు తెచ్చుకుంటున్నాము. రేగ గ్రామంలో నూతన డిఆర్ డిపో నిర్మించాలి.

– **గుబ్బాయి రామనాయుడు**, గిరిజనుడు, రేగ గ్రామం, అరకులోయ.

ప్రతిపాదనలు పంపుతాం



శిథిలస్థకు చేరిన డీఆర్ డిపో భవనాల మరమ్మతుకు ఇంజినీరింగ్ అధికారుల ద్వారా ఎస్టిమేట్ వేయాలని జీసీసీ ఉన్నతాధికారులు ఆదేశించారు. టీడబ్ల్యూ ఇంజినీరింగ్ అధికారులు అరకులోయ, డుంబ్రిగుడ మండలాల పరిధిలోని 26 డిపో భవనాల మరమ్మతు, భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి, ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం. అనుమతులు రాగానే నూతన భవనాల నిర్మాణ చేపడతాం.

– **వి. శ్రీనివాసరావు**, మేనేజర్, జీసీసీ బ్రాంచ్ అరకులోయ,

మండల గిరిజన సంఘం నూతన కార్యవర్గం

అరకులోయ రూరల్: మండల కేంద్రం గిరిజన సంఘం కార్యాలయం వద్ద శనివారం గిరిజన సంఘం మండల నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా గెమ్మెలి చిన్నబాబు, కార్యదర్శిగా గత్తుం బుజ్జిబాబులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారికి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్, అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు చెప్పారు.

గిరిజన రైతులకు ఎరువులు పంపిణీ చేయాలి

చింతపల్లి: గిరిజన ప్రాంతంలో రైతులకు ఎరువులు పంపిణీ చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య జిల్లా పరిషత్ అధికారులను కోరారు. ఆయన శనివారం నిర్వహించిన విశాఖలో నిర్వహించిన జెడ్పీ స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎరవులు లేక రైతులు చాలా అవస్థలు పడుతున్నారని తెలిపారు. రాజ్‌మా వేసుకునేందుకు సమయం వచ్చిందని, విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరారు.కొయ్యూరు మండలం మంప పంచాయతీ కించవానిపాలెం జలాశయంలో చేపలు పెంపకం చేపడితే గిరిజనులకు ఆదాయం వస్తుందన్నారు. మత్స్యశాఖ అధికారులు దీనిపై దృష్టి సారించాలన్నారు. డౌనూరు నుంచి చింతపల్లి, ఆర్‌వీ నగర్ నుంచి సీలేరు వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న తుప్పలను తొలగించాలని , ఆర్‌వీ నగర్ నుంచి నూతుబంధ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.14 కోట్లు మంజూరయ్యాయని, కలెక్టర్ అనుమతి ఇచ్చిన వెంటనే పనులు మొదలు పెట్టాలని కోరారు.

ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు అభినందనలు



పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును అభినందిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు

జి.మాడుగుల: వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును వైఎస్సార్‌సీపీ అధిష్టానం నియమించడంపై పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు తదితరుల హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ 15అనుబంధ విభాగాలకు అధ్యక్షులను పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్టీ తెగలను ఒకతాటిపైకి తీసుకొచ్చి వైఎస్సార్‌సీపీకి మరింత అభివృద్ధికి విశ్వేశ్వరరాజు కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్నికైన పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును శనివారం మండల పార్టీ అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండబాబు, వైస్ ఎంపీపీ కె సత్యనారాయణ, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, రామకృష్ణ, హనుమంతరావు, మాలన్న, రవనీ, ఎంపీటీసీలు విజయకుమారి, సన్యాసిదొర, చిన్నారావు, లక్ష్మీ, మధు, నాయకులు లంకెల కళ్యాణం, వంజరి సీతారాంనాయుడు, వంట్లాబు దేముళ్లనాయుడు, నీలమ్మ,పాంగి రామకృష్ణ, అంద్రయ్య,ప్రకాష్ ప్రశాంత్, సోషల్ మీడియా కన్వీనర్ లక్ష్మణ్ హర్షం వ్యక్తం చేశారు. విశ్వేశ్వరరాజును పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నియమించిన వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

27న నేత్ర వైద్య శిబిరం



వైద్యాధికారి రాంబాబు

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఈ నెల 27న ఎల్ వి ప్రసాద్ కంటి ఆసుపత్రి విశాఖ పట్నం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రాంబాబు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ కంటి వ్యాధితో బాధపడుతున్న గిరిజనులు ఈ శిబిరంలో పాల్గొని ఉచితంగా పరీక్షలు చేసుకోవాలని ఆయన కోరారు.

విస్తారంగా వర్షాలు.. ఆనందంలో రైతులు



పరిడిలో వర్షపు నీరుతో కళకళలాడుతున్న చెరువు

దుంబ్రిగుడ: ఇటీవల మన్యంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో పొలాల్లో సమృద్ధిగా నీరు చేరింది. దీంతో పంటల సాగుకోసం నీటి కోరత తీరినట్టు రైతులు చెబుతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటుచేసిన గుంతల్లో వర్షపునీరు చేరింది. నిండుకుండలా జలకళలాడుతున్నాయి. గిరిజన రైతులు పండిస్తున్న వరి, కురగాయలు, జొన్నలు, రాగులు, కొర్రలు తదితర పంటలకు పుష్కలంగా సాగునీరు ఉన్నట్టు రైతులు చెబుతున్నారు. సాగునీటి చెరువుల్లో జలకళ సంతరించుకుంది.

గంజాయి రహిత గ్రామాలుగా మార్చేందుకు కృషి

అరకులోయ సీఐ హిమగిరి

అరకులోయ రూరల్: గంజాయి రహిత గ్రామలుగా మార్చడమే లక్ష్యంగా ప్రత్యేక దృష్టి సారిస్తానన్ని అరకులోయ సీఐ ఎల్ హిమగిరి తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతు అరకులోయ, దుంబ్రిగుడ, అనంతగిరి మండలాల పరిధి ఉన్న మారుమూల గ్రామల సైతం పోలీస్ శాఖ ప్రత్యేక కార్యక్రమల ద్వారా యువతీ వయువకులకు చైతన్య కార్యక్రమలు నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లోని యువత గంజాయి, డ్రగ్స్, మద్యపానంకు దూరంగా ఉండాలన్నారు. నవసమజ మార్పుకు యువతే కీలకమన్నారు. భవిషత్‌లో పోలీస్ శాఖ ద్వారా గ్రామాల్లో ప్రత్యేక సేవ కార్యక్రమలు నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా స్థానికులు నేరుగా పోలీస్ శాఖకు సమచారం ఇవ్వాలని కోరారు.

అనంతగిరి (అరకులోయ రూరల్): మండలంలోని పోలీసు స్టేసన్‌ను అరకులోయ సీఐ హిమగిరి శనివారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. మండలంలోని శాంతిభద్రతలు కాపాడడంలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషించాలని, ప్రజలతో మమేకంగా ఉండాలన్నారు. గంజాయి రహిత సమాజానికి నిర్మిచాలని ఎస్ఐ కె.రాముతో పాటు సిబ్బందిని సూచించారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న సీఐ హిమగిరి

150 మందికి వైద్య పరీక్షలు

కూనవరం: ఓంకార్ చారిటబుల్ ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కూనవరం పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని వెంకటాయపాలెం గ్రామంలో ఓంకార్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొని, సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరాలు, ఒళ్లునొప్పులు, చర్మ సంబంధిత సమస్యలు, బీపీ, సుగర్ వంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఎక్కువ మంది హాజరయ్యాయని తెలిపారు. వివిధ పరీక్షలు నిర్ధారణ అనంతరం ట్రస్ట్ వారు రోగులకు ఉచితంగా మందులతో పాటు, పండ్లు, పాలు పంపిణి చేశారు. హెల్త్ అసిస్టెంట్‌లు వెంకటేశ్వర్లు, రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ వెంకటలక్ష్మి, ఏఎన్‌ఎం అశ్విని, ఆశలు విజయలక్ష్మి, చిన్నమ్మలు, ఓంకార్ కారిటబుల్ ట్రస్ట్ సభ్యులు చిచ్చడి రాజేష్, మహేంద్ర, సోమరాజు, హనుమంత్ రావు తదితరులు పాల్గొన్నారు.



వెంకటాయపాలెంలో వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యాధికారి, సిబ్బంది, ట్రస్ సభ్యులు

రోడ్డుకు అడ్డంగా నిలిచిన లారీ

రెండురోజులుగా వాహన రాకపోకలకు ఇబ్బందులు



రోడ్డుకు అడ్డుగా నిలిచిపోయిన వాహనంతో అవస్థలు

దుంబ్రిగుడ: మండలంలోని కించుమండ సంతబయలులో నూతనంగా నిర్మిస్తున్న భద్రాచలం-రాయిపూర్ హైవే ఎన్‌ఎచ్ 515 రోడ్డు మధ్యన భారీ లారీ నిలిచిపోవడంతో వాహన రాకపోకలకు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నెల 23న శుక్రవారం తెల్లవారుజామున లారీ మరమ్మతులకు గురై రోడ్డుకు అడ్డుగా నిలిచిపోయింది. రెండురోజులుగా నిలిచిపోయి లారీ తీయలేదు. ఈ మార్గం మీదుగా గుండా ప్రయాణించే పాడేరు కేంద్రానికి అరకులోయ ప్రధాన రోడ్డు కావడంతో ఈ రోడ్డు మీదుగా వెళ్ల వాహనాల రాకపోకలు స్తంభించాయి. రోడ్డుకు అడ్డంగా వాహనం నిలిచిపోయిన వెంటనే దానిని బయటికి తీసి పక్కకు పెట్టడంలో నిర్లక్ష్యం చేయడం కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నాయని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేశారు.

పార్కులో సుందరీకరణ పనులు



పార్కులో కలుపు మొక్కలను తొలగిస్తున్న సిబ్బంది



సుందరంగా తీర్చిదిద్దిన గార్డెన్

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతంలో పర్యాటకుల సందడి ప్రారంభమైంది. మన్యంలో ఆహ్లాదకరమైన వాతావరణం మొదలవడంతో పర్యాటకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. పర్యాటక ప్రదేశాల్లో సందర్శకుల తాకిడి ఎక్కువగా కనిపిస్తోంది. ఇందులో భాగంగా మండలంలోని పేరొందిన చాపరాయి జలపాతం పరిసరాలు, పగోడ పార్కును సుందరంగా తీర్చిదిద్దుతున్నాయి. ఇందులో భాగంగా గార్డెన్‌లో కలుపుమొక్కలను తొలగింపు, ఇతరత్రా పారిశుధ్య పనులు చేపడుతున్నట్టు చాపరాయి ఇన్‌చార్జి అప్పారావు తెలిపారు. పార్కులోని పూలతోట, ఇతరత్రా మొక్కల సంరక్షణ పనులు చేపడుతున్నారు. చాపరాయి పార్కును సుందరంగా తీర్చిదిద్దే పనుల్లో సిబ్బంది నిమగ్నమై ఉన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షీయాజ్ ఖాన్

నర్సీపట్నం: సెప్టెంబర్ 14న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షీయాజ్ ఖాన్ పేర్కొన్నారు. కోర్టు సముదాయంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులను ఇరు వర్గాల అంగీకారంతో సత్వరమే పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ విషయాన్ని కక్షిదారుల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా ఇరువర్గాలకు మేలు చేకూరుతుందన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే అపీల్‌కు వెళ్లే అవకాశం ఉండదన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా చైతన్యం తీసుకురావాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి మధుసూధన్‌రావు, అదనపు సివిల్ జడ్జి రోహిత్ మాట్లాడారు.

పాఠశాలల్లో బేస్‌లైన్ పరీక్షలు



బేస్‌లైన్ పరీక్షను పర్యవేక్షిస్తున్న అధికారులు



శరభవరంలో పరీక్షను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు



చవిటిదిబ్బలులోని కేజీబీవీలో బేస్‌లైన్ పరీక్షను పరిశీలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

రాజవొమ్మంగి: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని గుర్తించేందుకు శనివారం బేస్‌లైన్ పరీక్షలు జరిగాయి. బేస్‌లైన్ టెస్ట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా విద్యార్థులకు ఏ,బీ,సీ,డీ గ్రేడ్‌లుగా విభజించనున్నట్టు ఎంఈవో సూరయ్యరెడ్డి చెప్పారు. పరీక్ష ఫలితాల్ల సీ, డీ గ్రేడ్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటామన్నారు,. మండలంలో వివిధ పాఠశాలల్లో జరగుతున్న బేస్‌లైన్ టెస్టులను ఏజెన్సీ డీఈఓ మల్లేశ్వరరావు, ఎంపీడీవో యాదగిరీశ్వరరావులు పర్యవేక్షించారు.

గంగవరం: ఏజెన్సీలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండలంలో 61 పాఠశాలల్లో బేస్‌లైన్ టెస్టు నిర్వహించినట్లు ఏటీడబ్ల్యూఓ కృష్ణమోహన్ తెలిపారు. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు గల సుమారు 2500 మంది విద్యార్థులు బేస్‌లైన్ పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణను మండల స్థాయి అధికారులు పర్యవేక్షించినట్టు తెలిపారు. గంగవరంలోని ఆశ్రమ పాఠశాలను తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంఈఓ-2 మల్లేశ్వరరావు పర్యవేక్షణ చేశారు. పాత రామవరం, నెల్లిపూడిలో పాఠశాలను సీడీపీవో లక్ష్మి, లక్కొండ పాఠశాలలో బెస్‌లైన్ టెస్టును ఏటీడబ్ల్యూఓ కృష్ణమోహన్, పెరల్ జిల్లా కోఆర్డినేటర్ సతీష్‌లు పర్యవేక్షించారు.

వై.రామవరం: దేవరమడుగులులో ఎంపీపీ, చవిటిదిబ్బలు కేజీబీవీ, దాలిపాడు ఆశ్రమ, పెద్ద ఊలెంపాడు ఎంపీపీ, కోట ఆశ్రమ, యర్రంరెడ్డిపాలెం జీపీఎస్, పాఠశాలలను ఎంపీడీవో బాపన్నదొర సందర్శించి బేస్‌లైన్ పరీక్షలను పరిశీలించారు.

ఆచరణాత్మక జ్ఞానంతో అద్భుత ఫలితాలు

మురళీనగర్(విశాఖ) : ఆచరణాత్మక జ్ఞానంతోనే అద్భుత ఫలితాలు సాధ్యమవుతాయని ఆంధ్రా యూనివర్సిటీ రీజియన్ ఆర్‌జేడీ జె. సత్యనారాయణ మూర్తి అన్నారు. ఏపీసీటీఈ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వారం రోజులుగా తయారీ నాణ్యత అంశంపై నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఉత్పత్తుల సాధనలో శాస్త్రీయత, విశ్లేషణాత్మకత అంశాలకు ప్రాధాన్యతనివ్వడం ద్వారా నాణ్యతా ప్రమాణాలు సాధించగలమన్నారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని శిక్షణ పొందిన అధ్యాపకులు మెకానికల్ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచాలని సూచించారు. ఆంధ్రా యూనివర్సిటీ మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫసర్ డాక్టర్ కె. రాంజీ మాట్లాడుతూ నైపుణ్యం విద్యార్థులకు అత్యంత శక్తివంతమైన పరికరమన్నారు. విశాఖ రిఫైనరీ డీజీఎం కేతు శ్రీధర్ మాట్లాడుతూ తయారీలో నాణ్యత నిర్వహణ పరిశ్రమల్లోనే కాకుండా నిజ జీవితంలో కూడా ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులకు ధ్రువపత్రాలు అందించారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన నిర్వహించిన స్టీల్ ప్లాంట్ రిటైర్డ్ జీఎం రామ్మోహనరావు, గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ, పెందుర్తి పాలిటెక్నిక్ ఓఎస్‌డీ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.